# ఆత్మతత్వాన్ని ప్రేమించడమే ఆధ్యాత్మికం

**సకల విద్యలు నేర్చి సభ జయించగ వచ్చు**
**శూరులై రణమున పోరవచ్చు**
**రాజరాజై పుట్టి రాజ్యమేలగవచ్చు**
**హేమగోదానముల్ యీయవచ్చు**
**గగనంపు చుక్కలు గణియింపగావచ్చు**
**జీవరాసుల పేర్లు చెప్పవచ్చు**
**అష్టాంగవిద్యలనన్ని నేర్వగవచ్చు**
**చంద్రమండలయాత్ర సలుపవచ్చు**
**కాని దేహేంద్రియముల నరికట్టి**
**మనసు నిల్పియు నంతర్ముఖమ్ము చేసి**
**అనవరత నిశ్చల సమానచిత్తులై**
**నిలువ గలరా మానవుల్ నియతితోడ!**

**ప్రేమస్వరూపులారా!** ఈనాడు విద్యారంగమునందు అనేకవిధములైన సదస్సులు, సంప్రదింపులు జరుగుతూనే ఉన్నాయి. అయితే, అసలు విద్య (Education) అంటే ఏమిటో మొట్టమొదట గుర్తించటానికి మనం ప్రయత్నించాలి. ప్రపంచంలోనున్న గ్రంథములన్నింటినీ చదువవచ్చు, వాటి అర్థములను వివరించవచ్చు. అంతమాత్రముచేత మానవుడు విద్యావంతుడు కాజాలడు. ఉన్నత విద్యను అభ్యసించిన మేధావులు లోకంలో అనేకమంది కనిపిస్తూనే ఉన్నారు. ఐతే, యీ విద్యవలన వారిలో కలిగిన మార్పు ఏమిటి? సమాజానికి వారు చేస్తున్న ఉపకారమేమిటి? అనే విషయములను గుర్తించుటకు ఎవ్వరూ ప్రయత్నించడం లేదు. భౌతికమైన విద్యవలన హృదయంలో ఏనాటికీ మార్పు కలుగదు.

srisathyasaivachanamrutam

విద్యను అంతర్ముఖము గావించుకోవాలి. అప్పుడే దాని తత్త్వము బోధపడుతుంది. భౌతికమైన తెలివితేటలను అభివృద్ధి గావించుకున్నంత మాత్రమున ప్రయోజనం లేదు; మానసిక, ఆధ్యాత్మికతత్త్వములను కూడా విచారణ చేయడం అవసరం. ఈ మూడింటినీ చేర్చి మన కాలేజీలో MBA కోర్సును ప్రారంభించాము. M అనగా మానసికతత్త్వము (Mind). B అనగా దేహతత్త్వము (Body). A అనగా ఆత్మతత్త్వము (Atma). దేహతత్త్వమును గుర్తించటం సులభమే. కాని, మానసికతత్త్వమును అర్థం చేసుకోవడం కష్టం. ఆత్మతత్త్వమును అర్థం చేసుకోవడం మరింత కష్టం. ఆత్మకు ఒక నిర్ణీతమైన రూపము లేదు. ఆత్మ అనగా చైతన్యశక్తి. దీనినే Consciousness అన్నారు. ఇది సర్వవ్యాపకమైనది. దేహములో ఉన్న ఆత్మ తత్త్వమునకు Conscience అని పేరు. ఇంద్రియ సంబంధమైన తత్త్వమునకు Conscious అని పేరు. నేటి చదువరులు Conscience, Conscious లను కొంతవరకు అర్థం చేసుకో గలుగుతున్నారుగాని, సర్వవ్యాపకమైన Consciousness ను ఎవ్వరూ గుర్తించలేకపోతున్నారు.

**అంతర్ముఖమైన పరిశీలన చేయాలి**

విద్యార్థులారా! ఆధ్యాత్మికమంటే ఏదో మనకు అర్థంకాని తత్త్వమని భావించరాదు. అంతర్భూతమైన చైతన్యశక్తికి సంబంధించినది ఆధ్యాత్మికము. అయితే, Material knowledge (భౌతికజ్ఞానము)తో ఆధ్యాత్మికతత్త్వమును గుర్తించడానికి వీలుకాదు. Material knowledge కి అతీతమైన Fundamental knowledge ని మీరు సంపాదించాలి. అనగా, మూలాధారతత్త్వమును గుర్తించాలి. దానినే Awareness అన్నారు. (కర్చీఫ్‌ని చూపుతూ) ఇదేమిటి? అని అడిగితే మీరు 'కర్చీఫ్' అంటారు. అది Awareness అనుకుంటారు. (పుష్పాన్ని చూపుతూ) ఇదేమిటి? అని అడిగితే మీరు 'పుష్పము' అంటారు. అది Awareness అనుకుంటారు. కాని, ఇవన్నీ కేవలం భౌతికమైన రూపములే! వీటికి మూలాధారతత్త్వమేమిటో దానిని మీరు గుర్తించాలి. (కర్చీఫ్‌ను చూపుతూ) ఇదొక వస్త్రము. దీనికి ఏది ఆధారము? వస్త్రమునకు దారము ఆధారము. దారమునకు ప్రత్తి ఆధారము. ప్రత్తి లేకుండా దారము లేదు. దారము లేకుండా వస్త్రము లేదు. కాని, మనం వస్త్రమును మాత్రమే చూస్తున్నాముగాని, దానికి ఆధారమైన

sri sathyasaivahanamrutam

ప్రత్తిని గమనించటం లేదు. అదేరీతిగా, లౌకికమైన వస్తువులయొక్క స్వరూప స్వభావములను మాత్రమే గుర్తించడానికి మనం ప్రయత్నిస్తున్నాముగాని, వీటన్నింటికీ మూలాధారమైన తత్త్వమేమిటని ఎవ్వరూ విచారణ చేయడంలేదు. ఈ లోకంలో మనం గుర్తించవలసినది ఆత్మతత్త్వము ఒక్కటే. ఆత్మతత్త్వమును గుర్తించినవాడు అన్నింటినీ సులభంగా గుర్తించగలడు.

ఆత్మతత్త్వమనగా ఏమిటి? మన శరీరంలోని అంగములన్నీ పని చేయటానికి ఏది ఆధారమో అదే ఆత్మతత్త్వము. (పుష్పాన్ని చూపుతూ) పుష్పాన్ని చేతితో పట్టుకుంటాము. దీనిని పట్టుకునే శక్తి చేతికి ఎవరిచ్చారు? ముక్కుతో వాసన చూస్తున్నాము. వాసన గ్రహించే శక్తి ఎక్కడినుంచి వచ్చింది? అంతర్ముఖమైన ఆత్మతత్త్వమే దీనికి ఆధారం. కాని, ఈ సత్యాన్ని గుర్తించడానికి ఎవ్వరూ ప్రయత్నించటం లేదు. "ఇది నా చేయి, యిది నా కాలు, యిది నా తల," అంటున్నావు. మరి నీవెవరు? నీ ఎదుటి వ్యక్తిని, "అయ్యా, నీవెవరు? ఎక్కడినుండి వచ్చావు?" అని అడుగుతున్నావు. కాని, "నేనెవరు? ఎక్కడినుండి వచ్చాను?" అని నిన్ను నీవు ప్రశ్నించుకోవడం లేదు. 'నిన్ను నీవు తెలుసుకో,' అని బోధిస్తున్నది వేదాంతము. 'నేను' అంటే ఎవరో తెలుసుకున్నప్పుడు మనం అన్నీ తెలుసుకున్న వారమౌతాము. ఆధ్యాత్మికమనగా అర్థంకాని వ్యర్థమైన తత్త్వం కాదు. అన్నింటికీ మూలాధారమైన తత్త్వం ఒకటున్నది. దానిని గుర్తించడానికి ప్రయత్నం చేయాలి.

ప్రేమస్వరూపులారా! ప్రేమయే దైవము. ఈ సత్యాన్ని మీరు మొట్టమొదట గుర్తించాలి. ప్రేమలేక మానవుడు ఉండగలడా? ప్రేమ లేక ప్రాణమే లేదు. ప్రేమ లేక వస్తువులే లేవు. ప్రేమ లేక ప్రపంచమే కనిపించదు. ప్రేమయే అన్నింటికీ అంతర్భూతమైన దివ్యశక్తి. Love is God, Truth is God (ప్రేమయే దైవం. సత్యమే దైవం). 'త్రికాలాబాధ్యం సత్యం'. త్రికాలములకు అతీతమైనది సత్యం. సత్యమునకు రూపం లేదుగాని, గొప్ప అర్థమున్నది. మనం God (భగవంతుడు) అనే పదాన్ని ఉపయోగిస్తున్నాము. ఏదైనా తప్పు చేసినప్పుడు నాస్తికుడు సైతం, Oh my God! అంటాడు. కాని, God అంటే ఎవరో సరియైన అర్థమును ఎవ్వరూ చెప్పలేరు. అది అనుభూతికి మాత్రమే తెలుస్తుంది. అదేరీతిగా, సత్యమనే పదముయొక్క అర్థమును స్వానుభూతిద్వారానే గుర్తించడానికి వీలౌతుంది. ఆ

అనుభూతిని వర్ణించడానికి వీలుకాదు. 1 + 1 రెండవుతుంది. 2 + 2 నాలుగవుతుంది. 2 - 1 ఒకటవుతుంది. ఈరీతిగా ప్లస్సులు, మైనెస్సుల గురించి చెప్పగలుగుతున్నారేగాని, వీటికి ఆధారమేమిటో ఎవరైనా చెప్పగలరా? ఈ ప్రపంచంలోని సమస్త పదార్థములనుగురించి మనం చెప్పగలుగుతున్నాము. కాని, వాటి సత్యస్వరూపము గుర్తించటానికి ప్రయత్నించటం లేదు.

ఈ ప్రపంచమంతయూ పంచభూతములతో ఏర్పడినది. ఇదంతా పదార్థమయమైన లోకం. దీనికి అతీతమైనది మానసికలోకము. ఈ మానసిక లోకానికి అతీతమైనది మరొకటున్నది. అదే ఆత్మతత్త్వము. దానినే Transcendental Principle అన్నారు. 'బుద్ధి గ్రాహ్యమతీంద్రియమ్,' అన్నారు. ఈ మూలాధారతత్త్వం ప్రతి మానవునియందున్నది. ప్రేమయే దైవం అంటున్నాము. కాబట్టి, ప్రేమయే సర్వులయందున్న మూలాధారతత్త్వం. దానినే మనం 'నేను' అని పిలుస్తున్నాము. దీనిని మనం చక్కగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. నీలో ఉన్న 'నేను', ఇతరులలో ఉన్న 'నేను' ఒక్కటే. ఇది ఒక్క ఆధ్యాత్మిక మార్గములో మాత్రమే గుర్తించడానికి వీలౌతుంది. నిదానంగా, అంతర్ముఖంగా ఆలోచన చేస్తూపోతే కట్టకడపటికి తేలేది అదొక్కటే. కాని, ఈనాడు అంతర్ముఖమైన పరిశీలన ఎవ్వరూ చేయటం లేదు. అర్థం పర్థం లేనివాటిగురించి పరిశీలన చేస్తూ కాలాన్ని వ్యర్థం చేస్తున్నారు.

**దేహం 'నేను' కాదు, అనంతమైన ఆత్మతత్త్వమే 'నేను'**

ప్రేమస్వరూపులారా! అంతర్ముఖమైన దృష్టితో చూడండి. దైవమున్నాడు. 'నేనే' దైవం. ఈ సత్యాన్ని నమ్మండి. ఆత్మతత్త్వమును నమ్మకంచేతనే గుర్తించడానికి వీలవుతుంది. నమ్మకం లేకపోతే దేనినీ గుర్తించలేము. మొట్టమొదట 'నేను' (I) అనే ఏకత్వమును నమ్మండి. అప్పుడే 'నీవు' (you) ఎవరో అర్థం చేసుకోవడానికి వీలవుతుంది. 'I + youÑ రెండూ చేరినప్పుడు 'weÑ అవుతుంది. 'we + He' ఏమవుతుంది? 'HeÑ అవుతుంది. 'He' (భగవంతుడు) శాశ్వతమైనవాడు. మిగిలినవన్నీ మార్పుచెందుతాయి. జీవితంలో నిరంతరం నీవు మార్పుచెందుతూనే ఉన్నావు. మొదట నీవు బాలునిగా ఉన్నావు. తరువాత యువకునిగా మారినావు. క్రమక్రమేణ వృద్ధునిగా మారిపోతావు. ఈవిధంగా మార్పుచెందే

srisathyasaivachanamrutam

దేహాన్ని నీవు నమ్ముకొంటే ప్రయోజనమేమిటి? మార్పుచెందని దైవత్వమును ఆధారం చేసుకోవాలి. ఆ దైవత్వమే నీయందు, అందరియందు ఉంటున్నది. He is every-where. He is in you, with you, above you, below you and around you. దైవత్వము నీలోపల, వెలుపల సర్వత్రా ఉన్నదనే నమ్మకమును దృఢం చేసుకోవాలి. ఈ దేహం మార్పుచెందుతుంది. ఈ లోకంలో అన్నీ మార్పుచెందునవే! ఆత్మతత్త్వమే అన్నింటికీ అతీతమైనది. అదియే సర్వత్రా నిండియున్న దైవత్వము. He is every-where. అటువంటి దైవత్వానికి ఏ పేరని పెట్టగలవు? పేర్లు పెట్టడం కాలమును వ్యర్థం చేసుకోవడమే! దైవత్వం సర్వవ్యాపకమనే సత్యాన్ని విశ్వసించి ప్రచారంచెయ్యి. సంపూర్ణమైన విశ్వాసమును పెట్టుకున్నప్పుడే నీవు దైవానుగ్రహమును సాధించగలవు. దైవమును నమ్మకుండా నీవు ఏ ప్రయత్నం చేసినా అదంతా వ్యర్థమైపోతుంది.

నీవు నీ దేహాన్ని దృష్టిలో పెట్టుకొని 'నేను' అనే పదాన్ని ఉచ్చరిస్తున్నావు. కాని, నిజానికి దేహం 'నేను' కాదు. అనంతమైన ఆత్మతత్త్వమే 'నేను'. అదియే నీయందున్న చైతన్యం. ఆ చైతన్యమే లేక నీవు లేవు. అట్టి చైతన్యమును గుర్తించడమే Awareness. కాని, ఈనాడు భౌతికమైన పరిజ్ఞానమునే Awareness అని చెబుతున్నారు. ఉదాహరణకు, (గులాబీ పుష్పమును చూపిస్తూ) ఇది గులాబీ పుష్పమని నీవు గుర్తించగల్గినంతమాత్రమున అది Awareness అనిపించుకుంటుందా? ఈ పుష్పానికి ఆ పేరు ఎవరు పెట్టారు? ఎవరు పెట్టారో నీకు తెలియదు. దీనికి మూలాధారమేమిటో నీకు తెలియదు. నీవు రూపనామములను మాత్రమే దృష్టిలో పెట్టుకుంటున్నావుగాని, యథార్థమైన తత్త్వమును గుర్తించడానికి ప్రయత్నించడం లేదు. మొట్టమొదట నీవు కన్నులు మూసుకొని అంతర్ముఖంగా ధ్యానం చేసి నీయందున్న ఆత్మతత్త్వమును గుర్తించు. 'సాధనమున పనులు సమకూరు ధరలోన'. సాధన చేయక దేనినీ మనము సాధించలేము.

ఆధ్యాత్మిక తత్త్వమును అర్థం చేసుకోవడం చాలా కష్టం. అయితే, కష్టమని దానిని వదలిపెట్టకూడదు. మొట్టమొదట నీ దేహతత్త్వమును నీవు గుర్తించు. ఇది పాంచభౌతికమైనది. ఇందులో అనేకరకములైన అంగములుంటున్నాయి. 'ఇది నా చేయి', 'ఇది నా తల' 'ఇవి నా వ్రేళ్ళు' అంటున్నావు. కాబట్టి, ఈ అంగములు 'నేను' కాదు. అన్ని



srisathyasaivachanamrutam

అంగములలో ఉన్నవాడినే 'నేను'. ఈ లోకములో ధనకనకవస్తువాహనాదులను మనం సాధించనక్కరలేదు. ఆత్మతత్త్వాన్ని సాధిస్తే సర్వమునూ సాధించినవారమౌతాము. "నేను ఎవరు?" అని నిన్ను నీవు ప్రశ్నించుకోవాలి. ఈవిధంగా విచారణ చేస్తూ ఉంటే 'నేను' అనేదే ఆత్మతత్త్వమని అర్థమవుతుంది. అనేకమంది ఆత్మకు అనేక పేర్లు చెబుతున్నారు. కాని, ఆత్మ రూపనామములకు అతీతమైనది. ఇదే మానవునియందున్న చైతన్యశక్తి. దీనిని గుర్తించాలంటే దృఢమైన విశ్వాసంతో విచారణ చేస్తూ ఉండాలి.

**ఆత్మపై లక్ష్యం పెట్టుకొని జీవితప్రయాణం సాగించు**

ఆధ్యాత్మికతత్త్వము అంత సులభంగా అర్థమయ్యేది కాదు. అయితే, అచంచలమైన నమ్మకమును పోషించుకుంటే తప్పక అర్థమవుతుంది. "నమ్మిక మను రెండు నయనంబులే లేని అంధులైరి మనుజులవని యందు." కన్నులు మూసుకో. ఏమి చూస్తున్నావు? చీకటిని చూస్తున్నావు. చీకటిని చూచేవాడు ఎవరు? చూచేవాడు ఒకడు ఉండాలి కదా! చూచేవాడు లేక అది చీకటి అని ఎట్లా చెప్పగలవు? ఆ 'రియాలిటీ'ని మనం దర్శించాలంటే అచంచలమైన నమ్మకము కావాలి. అట్టి నమ్మకముతో జీవిత ప్రయాణమును సాగించాలి. నమ్మకము లేకపోతే ప్రయాణం చేయలేవు, గమ్యం చేరుకోలేవు. నీవు ఎక్కడికి పోతున్నావో నీకే తెలియనప్పుడు ఇక గమ్యం ఏవిధంగా చేరుకోగలవు? నీవు మందిరాన్ని చేరుకోవాలంటే మొట్టమొదట 'నేను మందిరానికి వెళుతున్నాన'ని నిర్ణయం చేసుకోవాలి కదా! అదేవిధముగా, ఆత్మతత్త్వమే నీ జీవితగమ్యంగా భావించాలి. ఆత్మయే దైవత్వమని గుర్తుపెట్టుకోవాలి. ఆత్మపై లక్ష్యం పెట్టుకొని జీవిత ప్రయాణమును సాగిస్తే తప్పక ఆత్మతత్త్వమును అర్థం చేసుకోగలవు.

**నిజమైన ప్రేమ ఆత్మసంబంధమైనది**

ప్రేమస్వరూపులారా! మీకు ప్రేమ అంటే ఏమిటో తెలియటం లేదు. కాని, ప్రేమిస్తున్నామంటున్నారు. "అతనంటే నాకు చాలా ప్రేమ," అంటారు. అయితే, దేనిని చూసి ప్రేమిస్తున్నారు? అతని దేహమును చూసి ప్రేమిస్తున్నారు; ధనమును చూసి ప్రేమిస్తున్నారు; రూపమును చూసి ప్రేమిస్తున్నారు; ప్రవర్తనను చూసి ప్రేమిస్తున్నారు. ఐతే,

srisathyasaivachanamrutam

ఆ రూపమునకు, ప్రవర్తనకు, అందచందములకు ఆధార మేమిటని మీరు విచారణ చేయడం లేదు. రూపమును చూసి ప్రేమిస్తే, ఆ ప్రేమ ఎంతకాలముంటుంది? మార్పుచెందే రూపమును కాదు మనం ప్రేమించ వలసింది, మార్పుచెందని ఆత్మతత్త్వమును ప్రేమించాలి. ఆత్మలో ఏ మార్పూ లేదు, ఏ కూర్పూ లేదు. ఒక చిన్న ఉదాహరణ: ఒక తల్లికి 20 సంIIల కుమారుడున్నాడు. కొంతకాలానికి అతను మరణించాడు. "నాయనా! ఇంతకాలం నిన్ను చూసుకొనే నేను బ్రతికాను. నీవు పోతే నేను బ్రతికేది ఎట్లా?" అని తల్లి దుఃఖిస్తున్నది. ఇది దేహాభిమానమువలన కలిగే దుఃఖము. ఇది కల్పనయేకాని, సత్యం కాదు. సత్యమైనది ఆత్మతత్త్వము ఒక్కటే. నిజమైన ప్రేమ ఆత్మసంబంధమైనదేగాని, దేహసంబంధమైనది కాదు. కనుక, మీరు ఆత్మతత్త్వమును ప్రేమించండి. ఈ ప్రేమయే ప్రాణము. ప్రేమయే దైవము. ప్రేమచేతనే మీరు దైవత్వాన్ని పొందగలరు. కనుకనే, అలనాడు గోపికలు ఈరీతిగా ప్రార్థించారు:

> ప్రేమరహిత మరుభూములలో
> ప్రేమాంకురములు పెంపొంద .... ప్రేమావేశముతో
> ప్రేమసుధావర్షము వర్షింపగ .... ప్రేమనదులు ప్రవహింపగ
> మురళీ గానము సేయగదే! .... కృష్ణా! గానము సేయగదే!

ఒక్క ప్రేమతత్త్వాన్ని మీరు అర్థం చేసుకుంటే చాలు. ప్రేమయే మీ సర్వస్వమని భావించుకోవాలి. ప్రేమనే మీరు ఆధారం చేసుకోవాలి. మీ ప్రేమను ప్రాపంచిక విషయాలపై, వస్తువులపై ప్రసరింపజేయవద్దు. అవన్నీ ఏదో ఒకనాటికి శూన్యమై పోతాయి. దేహము అనిత్యం, అశాశ్వతం. ఆత్మ ఒక్కటే సత్యనిత్యమని గుర్తించాలి. ఆత్మసంబంధమైన ప్రేమ శాశ్వత ప్రేమ. అట్టి ప్రేమచేతనే దైవత్వాన్ని పొందాలి.

**ఆశ, నిరాశలకు మూలం దేహభ్రాంతి**

విద్యార్థులారా! మీరు భౌతికమైన రూపమును ఆధారము చేసుకోవడంవల్లనే Appointment (ఆశ)కు, Disappointment (నిరాశ)కు గురి అవుతున్నారు. మీరు Appointment కు చోటివ్వవద్దు. అప్పుడు Disappointment కు ఏమాత్రం అవకాశముండదు. ఆశ విఫలమైనప్పుడు నిరాశ కల్గుతుంది. ఆశకు మూలకారణం

srisathyasaivachanamrutam

దేహభ్రాంతి. దేహము నీవు కాదు. కాబట్టి, దేహమును ఆధారము చేసుకోవద్దు. ఆత్మతత్త్వమే నీ నిజరూపము. అది ఎన్ని రూపములైనా ధరిస్తుంది. ఆత్మతత్త్వమే దైవత్వము. కాబట్టి, దైవాన్ని ఒక రూపమునకు పరిమితం చేయరాదు. రాముడు, కృష్ణుడు, గోవిందుడు... యివన్నీ పెట్టిన పేర్లేగాని పుట్టిన పేర్లు కాదు. ఏదో ఒక నామాన్ని మనం నిర్ణయం చేసుకొని స్మరించాలి. ప్రేమయే దైవం. సత్యమే దైవం. ప్రేమకు ఒక రూపం లేదు. సత్యమునకు ఒక రూపం లేదు. కాబట్టి, మీరు రూపమును ఆధారం చేసుకోవద్దు. ప్రేమను పెంచుకుంటూరండి. భగవంతుడనేవాడు ఒకడున్నాడు. భగవంతుడు లేకపోతే యీ ప్రకృతే లేదు. పరమాత్మనుండియే ప్రకృతి ఏర్పడుతున్నది. పరమాత్మనుండియే పరతత్త్వం ఏర్పడుతున్నది. అదే ఆత్మతత్త్వం. అట్టి పరతత్త్వాన్ని మీరు ప్రేమించండి. ఎప్పుడైనా అవకాశము చిక్కినప్పుడు ప్రేమతత్త్వాన్ని గురించి మరింత వివరంగా చెబుతాను. ఈ ప్రేమతత్త్వము మీకు చక్కగా అర్థమైనప్పుడు ఇంక నిరాశా నిస్పృహలకు ఏమాత్రం అవకాశమివ్వరు.

**పుట్టేది, చచ్చేది దేహమేగాని, నీవు కాదు**

ప్రేమస్వరూపులారా! దైవాన్ని పొందడానికి ఒక్కటే మార్గమున్నది. అదియే ప్రేమ. అదియే సత్యం. ఆ సత్యాన్ని గట్టిగా పట్టుకోండి. ఆ ప్రేమను గట్టిగా పట్టుకోండి. 'నేను' అనేదానికి రూపము ఆపాదించకండి. ప్రేమను ఒక రూపానికి పరిమితం చేయకండి. ఒక చిన్న ఉదాహరణ: కొద్దిరోజుల క్రిందట జానకి రామయ్య చనిపోయినాడు. అతనంటే ప్రేమ గలవారు అనేకమంది ఉంటున్నారు. వారు పేపర్లో వేశారు: 'జనకిరామయ్యా! మీరు మమ్మల్ని వదలివెళ్ళినందుకు మాకు చాలా దుఃఖంగా ఉంది. మీరు మళ్ళీ పుట్టి మా ప్రేమనందుకోండి,' అని. వీరి ప్రేమనందుకోవడానికి తాను తిరిగి పుట్టవలెనా! ఇదా మనం కోరవలసినది! పుట్టటం, చావటం యీ రెండింటియందే మోసం అయిపోతున్నది. జనన మరణాలు రెండూ అసత్యములే. జననం ఉన్నప్పుడు మరణం కూడా వస్తుంది. జనన మరణాలు దేహానికేగాని, ఆత్మకు కావు. కనుక, మనం ఆత్మతత్త్వాన్ని ప్రేమించాలిగాని, జననమరణాలు కల్గిన దేహాన్ని కాదు. నేను మిమ్మల్ని 'బంగారూ' అని పిలుస్తుంటాను. ఈ

sri sathyasai vachanamrutam

పిలుపులోనున్న అంతరార్థము ఏమిటి? బంగారును కరిగించి ఎన్ని నగలుగానైనా మార్చుకోవచ్చు. కాని, బంగారులో మార్పు ఉండదు. బంగారు ఎప్పుడూ బంగారే! అది శాశ్వతమైనది, సత్యమైనది. అదేవిధంగా, మీరు చచ్చేవారూ కాదు; తిరిగి పుట్టేవారూ కాదు. పుట్టేది, చచ్చేది దేహమేగాని, మీరు కాదు. మీరు ఆత్మస్వరూపులు. ఆత్మకు మార్పు లేదు. కనుకనే, నేను మిమ్మల్ని 'బంగారూ' అని పిలుస్తుంటాను. మారనటువంటి ఆత్మతత్త్వాన్ని మీరు కోరుకోవాలి. మార్పుచెందే రూపాన్ని కోరుకుంటే మోసమైపోతుంది. ఆత్మకు చావు, పుట్టుకలు లేవు. అట్టి సత్యనిత్యమైన ఆత్మతత్త్వాన్ని మనం కోరుకోవాలి. సత్యనిత్యము కాని దేహాన్ని కోరుతూ మనం మోసంలో పడిపోతున్నాము.

**లౌకికప్రేమను నమ్మకండి, ఆత్మను ప్రేమించండి**

మీయందున్న ఆత్మతత్త్వము పుట్టేది కాదు, గిట్టేది కాదు. అట్టి నిత్యసత్యమైన ఆత్మతత్త్వమును మీరు ప్రేమించండి. అప్పుడే మీరు నిజంగా ప్రేమస్వరూపు లవుతారు. సత్యంగా యీ ప్రేమను మాత్రమే మీరు నమ్మండి. లౌకికమైన ప్రేమను నమ్మకండి. దానిని నమ్మి, నమ్మి మీరు చాలా మోసమైపోతున్నారు. లౌకికప్రేమ తాత్కాలికమైనది, కదలిపోయే మేఘములాంటిది. శాశ్వతమైన ప్రేమను మీరు ప్రేమించండి. అదే ఆత్మతత్త్వము. ఆధ్యాత్మిక మార్గములో ప్రవేశించేవారు, ఆధ్యాత్మికతత్త్వమును తెలుసుకోవాలని ఆశించేవారు నాదగ్గరకు రండి. నేను చెబుతాను. I will explain. మీరు చదువవలసిన చదువులు చదవండి, చదువులో ఉన్న అంతరార్థాన్ని గుర్తించుకోండి. గుర్తించుకున్న అంతరార్థాన్ని ఆచరణలో పెట్టి అనుభవించండి, ఆనందించండి. ఈనాడు చాలామంది పిల్లలు లౌకికమైన, దేహసంబంధమైన ప్రేమను పెంచుకొని నిరాశకు గురి అవుతున్నారు. కట్టకడపటికి ప్రేమనే పూర్తిగా కోల్పోతున్నారు. శాశ్వతమైన ఆత్మను మీరు ప్రేమించాలి. నేను మిమ్మల్నందరినీ 'ప్రేమస్వరూపులారా!' అని పిలుస్తున్నాను. కాబట్టి, మీరు ప్రేమను మాత్రమే పెంచుకోండి. ప్రేమ మీ వెంట ఉన్నప్పుడు అదే మిమ్మల్ని కాపాడుతుంది

.(తేదీ 28.10.2003, వైస్ ఛాన్స్‌లర్ల సదస్సు ప్రారంభోపన్యాసం, సాయి కుల్వంత్ సభామండపం)

srisathyasaivachanamrutam